రాబడి



ఇలా.. ప్లాన్ చేసుకోండి

సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.

1 సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం

పదవీ విరమణ పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2 పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో పెట్టుబడుల కుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3 ఫిక్స్‌డ్ డిపాజిట్లు

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4 సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

5 నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరపు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6 సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం

60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేల దాకా పన్ను మినహాయింపుంటుంది.

7 ట్యాక్స్ ఫ్రీ బాండ్లు

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8 ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్‌ఎస్‌ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

9 మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్క్‌లకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10 పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

లాభాల స్వీకరణకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మొగిలిచెర్లలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుగొండ, సెప్టెంబర్ 1 : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్ల గ్రామానికి చెందిన మేరుగు వీరలక్ష్మి, 16వ డివిజన్ ధర్మారం గ్రామంలో గంగుల అరుణ్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబాలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. కార్పొరేటర్ ఆకుల మనోహర్, సుంకరి మనీషాశివకుమార్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, నాగరాజు, రాజయ్య, మల్లేశం పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలి మృతి

దుగ్గొండి, సెప్టెంబర్ 1 : ప్రమాదవశాత్తు పొలంలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన గిర్నిబావి గ్రామంలో జరిగింది. మందపల్లి గ్రామానికి చెందిన కొర్ర సమ్మక్క (75) మతి స్థిమితం సరిగా లేక పోవడంతో పలు గ్రామాల్లో తిరుగుతూ ఉండేది. శనివారం రాత్రి కురిసిన వర్షాలకు గిర్నిబావికి సమీపంలోని రైస్‌మిల్ ఎదురుగా ఉన్న కల్వర్టుపై కూర్చోబోతూ జారి పొలంలో పడి మృతి చెందింది. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి సమాచారం అందించడంతో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తన సిబ్బందితో అక్కడికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి, మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆమె కుమారుడు సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లండన్‌లో నాచినపల్లి వాసి మృతి

ప్రణయ్ (ఫైల్)

దుగ్గొండి, సెప్టెంబర్ 1 : ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన మండలంలోని నాచినపల్లికి విద్యార్థి మృతి చెందాడు. గ్రామానికి చెందిన దేవులపల్లి ప్రణయ్ ఏడాది క్రితం ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్లాడు. కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరాడని, ఆదివారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మరణించినట్లు అతడి తండ్రి రమేశ్ తెలిపారు. మృతదేహన్ని స్వస్థలానికి తరలించడానికి భారత ఎంబసీ అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సహాయం చేయాలని వేడుకున్నాడు.

రావూర్ నుంచి బస్సులు నడిపించాలి

రోడ్డు మీద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పర్వతగిరి, సెప్టెంబర్ 1 : మండలంలోని రావూరు గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సులను నడపాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్తులు రోడ్డుపై ఆందోళన చేశారు. కొన్ని రోజులుగా తమ గ్రామం నుంచి కాకుండా కల్లెడ పాత బ్రిడ్జి మీదుగా ఆర్టీసీ బస్సులు వెళ్తున్నాయని స్థానికులు ఆగ్రహంతో బస్సులను అడ్డుకున్నారు. ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగిసిన వేదాంత శ్రవణం

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 1 : దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం అనుబంధ సంస్థ అహం బ్రహ్మాస్మి ఆధ్వర్యంలో వరంగల్‌లోని శృంగేరి శంకరమఠంలో వేదాంత శ్రవణం-పురాణాలు-జ్ఞాన దీపికలు అనే అంశంపై రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న సదస్సు ఆదివారం ముగిసింది. శ్రీమద్భాగవతం-పంచమ స్కందం అనే అంశంపై పండితుడు మద్దులపల్లి దత్తాత్రేయ శర్మ వివరించారు. శంకరమఠం బ్రాంచి నిర్వాహకుడు సంగమేశ్వర జోషి, అహం బ్రహ్మాస్మి కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం మాస శివరాత్రి సందర్భంగా గురుపాదుక పూజ నిర్వహించారు.

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నాయకులు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 1: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతే కొనసాగించాలని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్మన్ గజ్జెల రాంకిషన్ అన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆదివారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జాక్ ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, సహాధ్యక్షులు హేమానాయక్, కందుల జీవన్, వెంకటస్వామి, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రావు, మురళీధర్‌రెడ్డి, గోవిందరావు, పీఆర్టీయూ కార్యదర్శి నామోజు శ్రీనివాస్, కడారి భోగేశ్వర్, తాటికాయ కుమార్, సోమయ్య, సాంబయ్య, భాను ప్రకాశ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా అధికార యంత్రాంగం

కలెక్టర్ సత్యశారద

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, సెప్టెంబర్ 1 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టారని కలెక్టర్ సత్య శారద తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని చెరువులు పొంగి పొర్లుతున్నాయని, తహసీల్దార్లు, ఇరిగేషన్, ఎంపీడీవోలతో బృందాలు ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో టోల్ ఫ్రీ నంబర్ 18004253434, 9154252936, జీడబ్ల్యూఎంసీ కంట్రోల్ రూంలో టోల్ ఫ్రీ నంబర్ 18004251980, 9701999645/76 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రివ్యూలో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

'కాంగ్రెస్ సర్కార్ టెండర్ రద్దు చేయడం తగదు'

నర్సంపేట రూరల్, సెప్టెంబర్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్‌ను రద్దు చేయడం తగదని బీఆర్ఎస్ నర్సంపేట మండల క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చిన్నపల్లి నర్సింగం అన్నారు. ఆదివారం మండలంలోని గురిజాలలో వారు మాట్లాడారు. గురిజాల గ్రామ శివారు నర్సంపేట-లింగాపురం ప్రధాన రహదారిలోని లో లెవల్ వంతెన స్థానంలో హై లెవల్ వంతెన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రూ.2కోట్ల 65లక్షల నిధులు మంజూరు చేశారని, అప్పట్లో దుగ్గొండి మండలం జీడికల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ టెండర్‌ను రద్దు చేసిందని, ఇది సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నామాల సదానందం, మండల ఉపాధ్యక్షుడు అల్లి రవి, నాయకులు దూడల ప్రకాశ్, పత్రి కుమారస్వామి, మంచిక దేవేందర్, సంగెం శ్రీకాంత్ ఉన్నారు.

సమావేశంలో మాటాడుతున్న క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి

ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న నూతన దంపతులు

ఆహార పొట్లాల పంపిణీ

కాశీబుగ్గ, సెప్టెంబర్ 1: నగరంలోని 14వ డివిజన్ చాకలి ఐలమ్మనగర్‌లోని లోతట్టు ప్రాంత ప్రజలకు ఆశ్రయం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దుస్సా విఘ్నేశ్ దంపతులు ఆదివారం ఆహారం పొట్లాలు పంపిణీ చేశారు. తమ వివాహమైన రెండు రోజులకే పేదలకు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ వైస్ చైర్మన్ గుండు రవిప్రసాద్, గోరంటల రాజు, గుండు కామేశ్వర్, కోట విజయ్ కుమార్, జీవన్‌సింగ్ పాల్గొన్నారు.

మత్స్యకారుడిని సూచన చేస్తున్న ఎస్సై రఘుపతి

చేపల వేటకు వెళ్లొద్దు

ఖానాపురం, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు పాకాల సరస్సులోకి చేపల వేటకు వెళ్లొద్దని ఎస్సై రఘుపతి అన్నారు. ఆదివారం పాకాల సరస్సులోకి చేపల వేటకు వెళ్లే మత్స్యకారులను పోలీసులు నిలిపివేశారు. వర్షాలు తగ్గముఖం పట్టాక యథావిధిగా వెళ్లొచ్చని, జాలర్లు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కరీమాబాద్ : ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి అన్నారు. ఆదివారం ఉర్సు సీఆర్సీ సెంటర్‌లో సమావేశం నిర్వహించి మొక్కలను నాటారు.

మత్తడి పోస్తూ కనువిందు చేస్తున్న పాకాల సరస్సు

మత్తడితో కనువిందు చేస్తున్న పాకాల సరస్సు

ఖానాపురం, సెప్టెంబర్ 1 : రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పాకాల సరస్సు పూర్తిస్థాయిలో నిండి మత్తడి పోస్తూ కనువిందు చేస్తున్నది. పాకాల సరస్సు ఈ సీజన్‌లో మత్తడి పోయడం ఇది రెండోసారి. కాగా, పాకాల మత్తడి పోస్తుండడంతో యాసంగి పంట ఖాయమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మత్తడి అందాలను వీక్షించడానికి పర్యాటకులు భారీగా తరలి వస్తున్నారు. పర్యాటకులు మత్తడిలో పడి ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు పర్యాటకులను కట్టపైకి అనుమతించడం లేదు. బారికేడ్లను ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నెక్కొండలో నిలిచిన సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్

ప్రయాణికులకు వాటర్ బాటిల్స్, బిస్కెట్లు పంపిణీ చేసిన స్థానికులు

నెక్కొండలో సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్

నెక్కొండ : నెక్కొండ -కేసముద్రం మార్గం లో రైల్వేట్రాక్ దెబ్బతిని రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో నెక్కొండలో సిమ్లా నుంచి విశాఖపట్నం వెళ్లే సంబల్పూర్ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే అధికారులు నిలిపివేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ప్రయాణికులు రైల్వేస్టేషన్‌లోనే నిలిచిపోయి అవస్థలపాలయ్యా రు. నెక్కొండలోని చల్లా గోదాముల యజమాని చల్లా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రయాణికులకు వాటర్ బాటిల్స్, బిస్కట్లు పంపిణీ చేశారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు

చాపర్తి కుమారస్వామి గాడ్గెని పరామర్శిస్తున్న బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరున హరి శేషు డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ నిరాహారదీక్ష చేపట్టిన చాపర్తి కుమారస్వామి గాడ్గేను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుల గణన చేపట్టడంతో పాటు ప్రతి బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయిస్తామని, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. డాక్టర్ ఎర్రబొజ్జు రమేశ్, దామెరకొండ కొమురయ్య, మాదాసి సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్.. గ్రీవెన్స్ సెల్ రద్దు

ఖిలావరంగల్/వరంగల్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలు ఇంకా కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ రెండో శనివారం పని దినంగా పరిగణించాలని పేర్కొన్నారు. అలాగే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడ